



# కరపత్రం

SINCE 2014

ఆదివారం జూన్ 28, 2026 | సంపుటి : 2 | సంచిక : 256 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## రాష్ట్ర రోడ్లకు ఇక మహర్దశ

- హ్యామ్ రోడ్లకు నేడు సిఎం శంకుస్థాపన
- నల్లగొండ జిల్లా కనగల్‌లో నేడు శ్రీకారం



నల్లగొండ,జూన్27 :
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రహదారుల రూపురేఖలను మార్చేలా ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతోంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక రోడ్ల పనులకు 28న నల్గొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ మెగా రోడ్డు ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సుమారు రూ. 13,006 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాలను అనుసంధానిస్తూ వేగవంతమైన, సురక్షితమైన , అత్యాధునిక రవాణా సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా మొదటి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,092 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 441 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, వాణిజ్య పరంగా కీలకమైన మార్గాలను బలోపేతం చేసేందుకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. హ్యామ్ విధానం లో చేపట్టడం వల్ల పనులు అత్యంత నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఈ రహదారుల రూపకల్పన జరిగింది. కనగల్‌లో జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు, ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కానున్నారు. ఈ పనులు పూర్తయితే తెలంగాణలో మౌలిక వసతుల రంగం సరికొత్త మైలురాయిని అధిగమిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.



## ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం

- వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం తగదు
- మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

హైదరాబాద్,జూన్27 :3
తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ... 32 డిమాండ్లలో 29 పరిష్కారానికి చర్యలు పూర్తి అయ్యాయన్నారు. 11శాతం పీఆర్సీ జులై జీతాల నుంచే అమలు చేయనున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామన్నారు. విలీన కమిటీలో కార్మిక ప్రతినిధులకు చోటు కల్పిస్తామని చెప్పారు. గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే విలీన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. విలీన ప్రక్రియపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందన్నారు. కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఎన్నికల నోడల్ అధికారిగా జేఎల్‌సీ సునీత నియామకం జరిగిందన్నారు. ఏపీ తరహా ఇబ్బందులు రాకుండా విలీన విధివిధానాలను రూపొందించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు.

మిగతాద్ది 2 లో

## ముగ్గురు సిఎంలు ఏం మాట్లాడుకున్నారు ?

- ఆ చీకటి ఒప్పందం ఏమిటో ప్రజలకు చెప్పండి
- తెలంగాణ హక్కులుకు భంగం వాటిల్లేలా రేవంత్ నిర్ణయాలు
- మరోమారు విమర్శలు గుప్పించిన హరీష్ రావు



హైదరాబాద్,జూన్ 27 :
ఇటీవల కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన చీకటి ఒప్పందాలు ఏంటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో మూడు రాష్ట్రాల సీఎంలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురే కూర్చుని ఏం ఒప్పందాలు చేసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఏపీలో గుండ్రేవుల ప్రాజెక్టులు కడతామంటుంటే మన ముఖ్యమంత్రి చారిత్రక ఒప్పందం అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులకు నీళ్లు ఇవ్వబోమని ట్రిబ్యునల్ చెప్తే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాన్ని రానీయకుండా అడ్డుకున్నామని, కానీ ఇప్పుడు ఏపీ ముఖ్యమంత్రి తన శిష్యుడైన తెలంగాణలో సీఎం అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును ముందుకు తెచ్చారని ఆరోపించారు. ఆర్‌డీఎస్ కు పక్కా నీటి కేటాయింపులపై ఏమైనా స్పష్టమైన హామీ వచ్చిందా అని ప్రశ్నిస్తూ, రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన లేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కాంప్రమైజ్ అయినా బీఆర్ఎస్ అస్సలు ఒప్పుకోదని స్పష్టం చేశారు. గత అరవై ఏళ్లలో కాంగ్రెస్ ఏడాదికి సగటున 4 టీఎంసీల చొప్పున అనుమతులు తెస్తే, బీఆర్ఎస్ హయాంలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున పర్మిషన్లు తెచ్చామని గుర్తుచేశారు. మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నామని, ఇంకా 138 టీఎంసీల అనుమతులు రావాల్సి ఉందని వివరించారు. ఏపీ ప్రభుత్వం అక్రమంగా 'బనకచర్ల' ప్రాజెక్ట్ నిర్మిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోయిందని, ఆ నిద్రను తట్టిలేపింది బీఆర్ఎస్సేనని చెప్పారు. పాలమూరు పేరిట సమ్మక్క సారక్క ప్రాజెక్టును రేవంత్ రెడ్డి ఎండబెడుతున్నారని, తాగేందుకు మంచి నీళ్లు లేక పాలమూరు తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## గోదావరి వరదలపై అప్రమత్తం కండి




- గతానుభవాలతో ముందస్తు నష్టనివారణ చర్యలు
- పుష్కరాల సందర్భంగా గోదావరి తీరం పరిశుభ్రంగా ఉండాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల ఆదేశాలు

భద్రాద్రి కొత్తగూడెం,జూన్27 :
గోదావరి వరదల వల్ల ప్రజానష్టం, పంట నష్టం లేకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతం భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని తెలిపారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయలో గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికపై శనివారం జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

మిగతాది 2లో



## 'బీజేపీ తదుపరి టార్గెట్ తెలంగాణ'

హైదరాబాద్:
బీజేపీ తదుపరి టార్గెట్ తెలంగాణలో విజయ ఢంకా మోగించడమేనని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచే తెలంగాణలో విజయానికి నాంది పలుకుతామన్నారాయన. వచ్చే కార్పోరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయం సాధించి బీజేపీ సత్తా చూపెడతామన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసినా బీజేపీని ఓడించలేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మిగతాది 2లో



## ' ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే నాపై కక్ష సాధింపు'

హైదరాబాద్:
తనకున్న భద్రతను తొలగించడంపై మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్‌నేత నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశ్యపూర్వకంగానే తన భద్రతను తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసే తన భద్రతను తొలగించాయని విమర్శించారు. ప్రభుత్వాన్ని ఎండగడుతున్నందుకే తనకు భద్రతను తొలగించారన్నారు.



## పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు తేడా తెలియదా?

- బాధ్యతాయుత పదవిలో ఉన్న ఎంపి ఇలాగేనా వ్యాఖ్యలు
- అసదుద్దీన్ వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,జూన్ 27 :
ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ భారత పాస్‌పోర్టులు, పౌరసత్వంపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా ఉన్న అసదుద్దీన్‌కు పాస్‌పోర్టుకు, పౌరసత్వానికి మధ్య ఉన్న చట్టపరమైన తేడాలు తెలిసి ఉండాలని ఆయన హితవు పలికారు. రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారు

మిగతాద్ది 2 లో

## 70 ఏళ్లు.. నాలుగు తరాలు: సుదీర్ఘ భూవివాదాన్ని ముగించిన సుప్రీంకోర్టు



ఓ భూమి కొనుగోలు విషయంలో దాదాపు ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదానికి సుప్రీం కోర్టు ముగింపు పలికింది. 1957లో చేసుకున్న ఓ సేల్ డీడ్‌ను సమర్థిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అయితే, ఈ కేసు తీర్పు వెలువరించిన న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎన్‌వీ అంజారియాలు జన్మించక ముందు నాటి వివాదం కావడం గమనార్హం.

## 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా

### ఈ- ఆటోలను ప్రారంభించిన మంత్రి సీతక్క



హైదరాబాద్,జూన్27 :
దివ్యాంగుల కోసం రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఈ-ఆటోల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా దివ్యాంగుల రవాణా సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ-ఆటోలను పంపిణీ చేయడం శుభపరిణామమని మంత్రి సీతక్క అన్నారు.

మిగతాద్ది 2 లో

## తెలంగాణ ప్రభుత్వానికి ట్రంప్ కృతజ్ఞతలు



హైదరాబాద్:
హైదరాబాద్ నగరంలో ఓ ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. యూఎస్ కాన్సులేట్ సమీపంలోని రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేయడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో స్పందించారు.అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో రహదారి నామఫలకాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అమెరికా రాయబారి సెర్గియో గోర్, హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ సమక్షంలో అధికారికంగా ఆవిష్కరించారు.

మిగతాద్ది 2 లో

# ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం

మొదటిపేజీ తరువాయి

ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు,÷నాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడి ల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం.పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు. దీనిలో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే ప్రక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీ లో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన ప్రక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మాట మీద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన ప్రక్రియ గురించి భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని గుర్తింపు సంఘం కార్మిక నేతలను కమిటీ లో చేర్చి విలీన విధివిధానాలు రూపొందించాలని భావిస్తుంది దీనిని సమస్త కార్మిక లోకం గమనించగలరని అన్నారు.

## బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం
## మేకను ఎత్తుకెళ్లిందంటున్న గ్రామస్థులు

జుక్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామ శివారులో మేత మేస్తున్న గొర్రెల గుంపులోకి వచ్చిన చిరుత.. ఓ మేకపిల్లను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు అక్కడ కనిపించిన అడుగుజాడలను పరిశీలించి అవి చిరుత పాదాలేనని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో రైతులు, పశువుల కాపరులు, గ్రామ ప్రజలు ఒంటరిగా పొలాలు, అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో అప్రమత్తంగా ఉండాలని, చిరుత కనిపించినా లేదా ఆనవాళ్లు గుర్తించినా వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామ పరిసరాల్లో చిరుత సంచారం నేపథ్యంలో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. అటవీ శాఖ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైతే చిరుతను బంధించేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

## అమీనాపూర్‌లో మహిళ, ఇద్దరు పిల్లలతో అదృశ్యం

**– జాగదొరక్కపోవడంతో కటుఉంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు**

వేల్పూర్ మండలం అమీనాపూర్‌లో మహిళ సహా ఇద్దరు చిన్నారులు అదృశ్యం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఓ మహిళ తన కుమారుడు, కుమార్తెతో కలిసి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడం సంచలనం సృష్టిస్తోంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 25న వేల్పూర్‌కు వెళ్తున్నట్లు చెప్పి ఇద్దరు పిల్లలతో సదరు మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే రాత్రి అయినా ఆమె ఇంటికి తిరిగి రాలేదు. మహిళ సెల్‌ఫోన్‌కు పలుమార్లు కాల్ చేసినా స్విచ్ఆఫ్ వస్తుండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎంత వెతికినా ఎక్కడా ఆమె జాడ తెలియరాలేదు. దీంతో బంధువులు, పరిచయస్తుల వద్ద ఆరా తీసినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరికి వేల్పూర్ పోలీసులను బాధిత కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మహిళ, చిన్నారుల ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. వారి వివరాలు తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని వేల్పూర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. కాగా, ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## నాలుగు తరాల భూ వివాదం
## తీర్పు వెలువరించిన సుప్రీం కోర్టు

నాలుగు తరాలుగా కొనసాగుతున్న ఒక భూవివాదానికి సుప్రీం కోర్టు తాజాగా ఫుల్ స్టాప్ పెట్టింది. భూమికి సంబంధించిన 1957 నాటి సేల్ డీడ్ చట్టబద్ధమేనంటూ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిన్ ఎన్.వి అంజరియాలతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించడంతో వివాదానికి ఫుల్ స్టాప్ పడింది. ఈ కేసులో అప్పీలు చేసుకున్న సరాఫత్ అలీ పూర్వీకులు 1957లో ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో కొంత భూమిని కొనుగోలు చేశారు. అప్పటికి సరాఫత్ అలీ మైనర్. నాటి నుంచీ ఆ భూమి సరాఫత్ అలీ కుటుంబం ఆధీనంలోనే ఉంది. భూమిని సరాఫత్ పూర్వీకులకు అమ్మిన కొందరు అభ్యంతరం చెప్పడంతో సేల్ డీడ్ జరిగినా మ్యూటేషన్ మాత్రం నిలిచిపోయింది. 1984లో వారు తమ అభ్యంతరాలను వెనక్కు తీసుకోవడంతో మ్యూటేషన్ కూడా పూర్తయ్యింది. అయితే, 1991లో ప్రభుత్వం భూమి ఏకీకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్రమంలో తనను భూమిదారుగా గుర్తించాలని సరాఫత్ దరఖాస్తు చేసుకున్నారు. 1993లో కన్సాలిడేషన్ అధికారి సరాఫత్ హక్కులను గుర్తించారు. అయితే, సరాఫత్ భూమిపై కో టెన్యూర్ హక్కులున్న మరికొందరు అభ్యంతరం లేవనెత్తారు. దీంతో 1999లో కన్సాలిడేషన్ అధికారి సరాఫత్ కుటుంబానికి వ్యతిరేకంగా తీర్పు వెలువరించారు. యూపీ జమీందారీ భూములు రద్దు చట్టం ప్రకారం 1957 నాటి సేల్ డీడ్ చెల్లదన్నారు. అంతేకాకుండా నాటి సేల్ డీడ్‌పై సంతకం చేసిన సాక్షి వివరాల్లో స్పష్టత లేకపోవడంతో సరాఫత్ కుటుంబానికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. చివరకు హైకోర్టులో కూడా సరాఫత్ కుటుంబానికి చుక్కెదురైంది. ఈ కేసులో సుప్రీం కోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. సాక్షి వివరాల్లోని స్వల్ప లోపాల ఆధారంగా సేల్ డీల్ చెల్లదని చెప్పలేమని పేర్కొంది. సేల్ డీడ్ ఫోర్జరీ జరిగిందనే ఫిర్యాదు కూడా లేకపోవడాన్ని ఈ సందర్భంగా కోర్టు పేర్కొంది. జమీందారీ చట్టానికి 1981లో చేసిన సవరణలు 1957కు వర్తించవని కూడా పేర్కొంది. నాటి సేల్ డీడ్ చెల్లుతుందంటూ తీర్పు వెలువరించింది.

## కేతన్ మర్డర్ కేసులో రోజుకో కొత్త విషయం

పుణెకు చెందిన యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా, క్రికెట్ కోణం వెలుగులోకి వచ్చింది. కేతన్ హత్య కేసులో నిందితులైన సియా గోయల్, చేతన్ చౌదరీల మధ్య ప్రేమ చిగురించడానికి కారణం క్రికెట్ అని తెలుస్తోంది. సియా గోయల్ సోదరుడు సాహిల్ గోయల్‌ను పోలీసులు 10 గంటలకుపైగా విచారించారు. విచారణ సందర్భంగా గోయల్ పలు ఆసక్తికర విషయాలు బయటపెట్టినట్లు సమాచారం. ఆ వివరాల ప్రకారం..
సాహిల్ క్రికెట్ మ్యాచ్‌లు ఆడేవాడు. క్రికెట్ మ్యాచ్‌లు చూడ్డానికి సియా తరచూ వెళు తుండేది. ఈ నేపథ్యంలోనే చేతన్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఓ సారి కామన్ ఫ్రెండ్స్ ఏర్పాటు చేసిన దివాళీ పార్టీలోనూ ఇద్దరూ కలిశారు. దీంతో ఇద్దరి మధ్యా స్నేహం బలపడి ప్రేమగా మారింది. సియా, చేతన్ ప్రేమించుకుంటున్న సంగతి సాహిల్‌కు తెలుసు. కేతన్‌తో సంబంధం మాట్లాడుతున్నపుడు సియా అభ్యంతరం వ్యక్తం చేస్తుందని సాహిల్ అనుకున్నాడు. కానీ, సియా అలా చేయలేదు.

# ‘బీజేపీ తదుపరి టార్గెట్ తెలంగాణ’

మొదటిపేజీ తరువాయి

(ఆదివారం) హైదరాబాద్‌కు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ వస్తున్నారని రాంచందర్ రావు తెలిపారు.

**తెలంగాణ వైపు బీజేపీ జాతీయ నాయకత్వం చూస్తుంది**

వరంగల్ : తెలంగాణ వైపు బీజేపీ జాతీయ నాయకత్వం చూస్తుందన్నారు రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్,. పశ్చిమ బెంగాల్‌లో గెలిచి మొదటి మాసంలో చెప్పిన మాటలను నిలబెట్టుకున్నామన్నారు. 29వ తేదీన నితిన్ నబీన్ వరంగల్‌లో పర్యటించనున్నారని, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బూత్ లెవెల్ కార్యకర్తల సదస్సులో నితిన్ నబీన్ పాల్గొంటారని లక్ష్మణ్ తెలిపారు.
జాతీయ అధ్యక్షుడి పర్యటనలో అన్ని వర్గాలను కలుస్తారని, గిరిజన నాయకులతో సమావేశం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఆస్తులను వేలం వేసి దోచుకుంటున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణలో బీజేపీని కాదని కాంగ్రెస్‌ని గెలిపిస్తే.. పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లు అయ్యిందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను పారిశ్రామిక అభివృద్ధి, ఎడ్యుకేషన్ హబ్ గా మార్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రయత్నాలు చేస్తున్నారని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు.

## తెలంగాణ ప్రభుత్వానికి ట్రంప్ కృతజ్ఞతలు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా శనివారం ఉదయం తన ‘ఎక్స్’ వేదికగా స్పందించిన డొనాల్డ్ ట్రంప్..‘హైదరాబాద్‌లో కొత్తగా ‘డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ’ ఏర్పాటు చేశారు. ఈ విధంగా గౌరవించబడిన మొట్టమొదటి అమెరికా అధ్యక్షుడిని నేనే. ధన్యవాదాలు!’ అని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.
ఈ నామకరణం ద్వారా భారత్--అమెరికా సంబంధాలు మరింత బలపడతాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. కార్యక్రమం అనంతరం అమెరికా ప్రతినిధులు కూడా ఈ నిర్ణయాన్ని సానుకూలంగా స్వాగతించినట్లు సమాచారం.

## 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా

మొదటిపేజీ తరువాయి

దివ్యాంగులు జీవితాన్ని సవాల్‌గా స్వీకరిస్తే అసాధారణ విజయాలను సాధించగలరని ఆమె పేర్కొన్నారు.
ముఖ్యమంత్రి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వారి అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'వైకల్యం అనేది కేవలం శారీరక లోపమే. మానవత్వంలేని వారే అసలైన దివ్యాంగులు. ఇతరులను అవమానించే అహంకారం కూడా ఒక రకమైన వైకల్యమే. పుట్టుకతో వచ్చిన లోపాలను తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరైన శిక్షణ, సమాజం సహకారంతో అధిగమించవచ్చు. చూపు, వినికిడి లేకపోయినా హెలెన్ కెల్లర్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచారు’ అని అన్నారు.
'దివ్యాంగులను చీదరించకుండా వారికి అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తారు. బ్రెయిలీ వంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అనేక మంది దివ్యాంగులు తమ లక్ష్యాలను చేరుకుంటున్నారు. తల్లిదండ్రులపై ఉన్న ఆర్థిక, రవాణా భారాన్ని తగ్గించడానికే ఈ-ఆటోల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం’ అని సీతక్క చెప్పారు. ఈ సందర్భంగా ఐఓసీఎల్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవల

**– గుజరాత్‌లో ట్యాక్సీ సేవలు ప్రారంభించిన అమిత్ షా**

రెండేళ్లల్లో 500 నగరాలకు ఈ ట్యాక్సీ సేవలు విస్తరిస్తాయని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. గుజరాత్‌లో తాజాగా భారత్ ట్యాక్సీ సేవలను ఆయన ప్రారంభించారు. కోఆపరేటివ్ మోడల్‌లో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండే ఈ యాప్ ప్రారంభ వేడుకల్లో హోం మంత్రి ప్రసంగిస్తూ ట్యాక్సీ సేవలు ప్రస్తుతం నిత్యావసరంగా మారాయని అన్నారు. భారత్ ట్యాక్సీలో ఇలాంటి శ్రమదోపిడీ ఉండదని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఒక న్యాయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని అన్నారు. ఇటీవల కాలంలో ఈ రంగం గణనీయంగా విస్తరించిందని అన్నారు. ప్రస్తుతం ద్విచక్రవాహనాలు కూడా బైక్ ట్యాక్సీలుగా కుంభమేళా లాంటి భారీ ఈవెంట్స్‌లో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రైవేటు రైడ్ హెయిలింగ్ యాప్స్‌పై కూడా విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ యాప్‌లు ఒక క్రమపద్ధతితో శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రవాణా ఆపరేటర్లను డ్రైవర్లుగా పిలవడం కంటే సారథులని పిలుస్తానని చెప్పారు. ప్రైవేటు ఆపరేటర్లే అధిక శాతం లాభాలు దండుకుని వర్కర్లను వేధించిన ఘటనలు ఉన్నాయని అన్నారు. వినియోగదారులు, డ్రైవర్లకు ఎలాంటి నష్టం చేకూర్చని వ్యవస్థ ఇదేనని అన్నారు. ఇప్పటికే 7 లక్షల మంది డ్రైవర్లు ఈ యాప్‌లో భాగస్వాములయ్యారని అన్నారు. సుస్థిర ఆర్థిక భద్రతను సొంతం చేసుకున్నారని అన్నారు. భారత్ ట్యాక్సీలో రేట్లు ఎక్కువగా ఉన్నాయన్న వాదనలను కూడా హోం మంత్రి కొట్టిపారేశారు. ప్రత్యర్థి యాప్‌లు కావాలనే వ్యూహాత్మకంగా తమ ధరలను తగ్గిస్తున్నాయని కూడా హోం మంత్రి ఆరోపించారు. ఈ యాప్‌ను మార్కెట్ నుంచి తప్పించేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. 'వాళ్లు ఇలా ఎంతకాలం చేయగలరు? భారత్ ట్యాక్సీ అలసిపోదు, యుద్ధ మైదానాన్ని వీడదు. నిలిచి పోరాడుతుంది.

## పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు
# తేడా తెలియదా?

మొదటిపేజీ తరువాయి

బాధ్యతాయుతంగా మాట్లాడాలని పేర్కొన్న కిషన్ రెడ్డి.. ప్రజలను తప్పుదారి పట్టించే ముందు అసదుద్దీన్ ఒవైసీ పౌరసత్వ చట్టం1955, పాస్‌పోర్ట్ చట్టం1967లను మరోసారి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. అసదుద్దీన్ వ్యాఖ్యలు చట్టంపై ఆయనకున్న అవగాహన లోపాన్ని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అయోమయం సృష్టించే ప్రయత్నాన్ని సూచిస్తున్నాయని మండిపడ్డారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణను కొందరు తప్పుగా చిత్రీకరిస్తున్నారని కిషన్ రెడ్డి
స్పష్టం చేశారు. విదేశాంగ శాఖ వివరణ ప్రకారం భారత పాస్‌పోర్టు విలువలేనిదని అర్థం కాదని, పాస్‌పోర్టు ఒక్కటే భారత పౌరసత్వానికి తుది, ఖచ్చితమైన ఆధారం కాదని మాత్రమే ప్రభుత్వం పేర్కొందని ఆయన వివరించారు. భారత పౌరసత్వం అనేది ఎల్లప్పుడూ భారత రాజ్యాంగం , పౌరసత్వ చట్టం1955 ప్రకారమే నిర్ణయించబడుతుందని స్పష్టం చేశారు. పాస్‌పోర్ట్ చట్టం1967 ప్రకారం పాస్‌పోర్టు అనేది ప్రధానంగా విదేశీ ప్రయాణాల కోసం ఉపయోగించే ఒక పత్రం (÷సజీు ఆనీఇబీప।నిబి) మాత్రమేనని కేంద్ర మంత్రి తెలిపారు. ఆ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం.. ప్రజాహితం దృష్ట్యా భారత పౌరుడు కాని వ్యక్తికి కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్టు లేదా ట్రావెల్ డాక్యుమెంట్‌ను జారీ చేసే ప్రత్యేక అధికారాన్ని కలిగి ఉంటుందని గుర్తుచేశారు. గతంలో కూడా ఇటువంటి ప్రత్యేక సందర్భాలు ఉన్నాయని, అందువల్ల పాస్‌పోర్టును మాత్రమే పౌరసత్వానికి తుది ప్రాతిపదికగా పరిగణించలేమని చెప్పారు. ఇది ఇప్పటికప్పుడు తెచ్చిన కొత్త నిబంధన కాదని, 1967లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. దాదాపు 60 ఏళ్లుగా అమల్లో ఉన్న చట్టపరమైన అంశాన్ని ఇప్పుడు మోదీ ప్రభుత్వంపై నెట్టడం అవగాహన లోపమో, లేదా వాస్తవాలను దాచిపెట్టే కుట్రో అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరసత్వ చట్టం1955 ప్రకారం ఒక వ్యక్తికి భారత పౌరసత్వం అనేది జననం, వంశపారంపర్యం, నమోదు లేదా నేచురలైజేషన్ ప్రక్రియల ద్వారా మాత్రమే లభిస్తుందని కిషన్ రెడ్డి వివరించారు. గతంలో 2013లో బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ.. పాస్‌పోర్టు, జనన ధృవీకరణ పత్రం వంటి పత్రాలు మాత్రమే పౌరసత్వాన్ని నిరూపించడానికి పూర్తిగా సరిపోవని న్యాయస్థానం స్పష్టం చేసిందని, దేశంలోని ఇతర హైకోర్టులు కూడా ఇదే సూత్రాన్ని అనుసరించాయని గుర్తుచేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎలాంటి కొత్త విధానాన్ని లేదా నిబంధనను ప్రకటించలేదని, దేశ చట్టాలు, న్యాయస్థానాలు ఇప్పటికే స్పష్టం చేసిన పాత అంశాన్నే మరోసారి పునరుద్ఘాటించిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## ముగ్గురు సిఎంలు
# ఏం మాట్లాడుకున్నారు ?

మొదటిపేజీ తరువాయి

మన రాష్ట్రంలోని మేడిగడ్డ గేట్లను రిపేర్ చెయ్యడం చేతకాదు గానీ, తుంగభద్ర గేట్ల రిపేర్ కోసం రేవంత్ రెడ్డి వెళ్తున్నారని విమర్శించారు. హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డికి హిట్లర్ స్ఫూర్తి అయితే, నీళ్ల విషయంలో రోమ్ తగలబడుతుంటే ఫిడేల్ వాయించిన నీరో చక్రవర్తి స్ఫూర్తి అనిపిస్తోందని ఎద్దేవా చేశారు. గుంపు మేస్త్రి అయిన రేవంత్ రెడ్డి, తెలంగాణను ముంచే ముంపు మేస్త్రి కావొద్దని హరీష్ రావు హితవు పలికారు. కాంగ్రెస్ వైఖరి వల్ల ఆంధ్రప్రదేశ్ సుజలం, కర్ణాటక సుఫలం, తెలంగాణ నిష్ఫలంగా మారుతోందని, కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు ఒక్క చుక్క నీటి విషయంలో అన్యాయం జరిగినా కేసీఆర్, బీఆర్ఎస్ ఊరుకునే ప్రసక్తే లేదని తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు.

## గోదావరి వరదలపై
# అప్రమత్తం కండి

మొదటిపేజీ తరువాయి

వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గోదావరి వరదల సన్నద్ధతపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశంలోపలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
గత వరదల అనుభవాలను పరిగణలోకి తీసుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశర చేశారు. వరదల వల్ల రహదారులు బ్లాక్ అయ్యే గ్రామాలను గుర్తించాలని సూచించారు. అత్యవసర వైద్యసేవలు, నిత్యావసర వస్తువుల రవాణాకు అడ్డంకులు లేకుండా యాక్షన్ ఎ÷-లాన్ ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, వైద్యం వంటి అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సమీక్షకు
ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏపీఓ రాహుల్, మేయర్ మూడ్ గణెశ్, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు.

## ‘ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే నాపై కక్ష సాధింపు’

మొదటిపేజీ తరువాయి

మావోయిస్టు, నక్సల్స్, ప్రభావితా ప్రాంతాల్లో పనిచేసినందుకు తనకు హోం శాఖ భద్రతను ఇచ్చిందని, రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతి ఏం చేశాడని స్పెషల్ భద్రతను ఇచ్చారని ప్రశ్నించారు. తన భద్రతను తొలగించడంపై డీజీపీకి లేఖ రాశానన్నారు. తనకు ఎలాంటి హానీ జరిగినా సీఎం రేవంత్‌రెడ్డిదే బాధ్యత వహించాలన్నారు. భద్రతను తొలగించినంత మాత్రానా ప్రజా సమస్యలపై, కాంగ్రెస్, బీజేపీ దోపిడీలు పై ప్రశ్నించను అనుకోవడం వారి మూర్ఖత్వమని హెచ్చరించారు.

## 70 ఏళ్లు.. నాలుగు తరాలు:
## సుదీర్ఘ భూవివాదాన్ని ముగించిన సుప్రీంకోర్టు

మొదటిపేజీ తరువాయి

ఉత్తరాఖండ్ హరిద్వార్‌లోని నర్సీపుర్ కలాన్ గ్రామంలో 15.5 బిఘాల భూమిని సరాఫత్ అలీ అనే వ్యక్తి పూర్వీకులు 1957 జూన్‌లో సేల్‌డీడ్ ద్వారా కొనుగోలు చేశారు. అప్పటినుంచి తమ స్వాధీనంలోనే ఉందనేది వారి వాదన. 1980ల్లో ఓసారి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా రెవెన్యూ అధికారులు అందుకు అంగీకరించారు. కానీ, 1991లో భూముల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ సమయంలో.. రికార్డుల్లో యజమానులుగా అమ్మిన వారి పేర్లే కనిపించాయి. దీంతో బాధితులు పై అధికారులకు ఫిర్యాదు చేశారు.అయితే, నాటి భూచట్టానికి అనుగుణంగా కొనుగోలు జరగలేదని, సాక్షి వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని చెబుతూ మ్యుటేషన్‌ను తిరస్కరించారు. 1957నాటి సేల్ డీడ్ చెల్లదన్నారు. దీంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం కూడా అధికారుల నిర్ణయాన్ని సమర్థించడంతో ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. విచారించిన సుప్రీం ధర్మాసనం.. సాక్షాల్లో చిన్న వ్యత్యాసాల ఆధారంగా సేల్‌డీడ్‌ను కొట్టివేయడం సరైంది కాదని పేర్కొంది. ఈ సందర్భంగా 1957లో చట్టబద్ధంగా రిజిస్టరైన డీడ్‌ను సమర్థిస్తూ కొనుగోలుదారులకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. అయితే, కేసు విచారణ క్రమంలోనే సరాఫత్ చనిపోగా.. అతడి చట్టబద్ధ వారసులు ఈ కేసుపై సుప్రీం కోర్టులో న్యాయపోరాటం చేశారు. దీంతో నాలుగు తరాలుగా కొనసాగిన ఈ వివాదం పరిష్కారమైనట్లైంది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం జూన్ 28, 2026

# మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా

## తాజా వార్తలు మరియు అప్‌డేట్

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి



### దక్షిణాసియా టోర్నమెంట్‌కు మేడ్చల్ యువకుడు

నేపాల్ రాజధాని ఖాట్మండులో జరగనున్న ప్రతిష్టాత్మక తొలి దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్‌కు భారత జట్టులో మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామానికి చెందిన గోపాల్ యాదవ్ ఎంపికయ్యారు.

### కేసారంలో విషాదం

కీసర పరిధిలో చిన్నారి అనుమానాస్పద మృతి కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

### మైనర్ బాలిక వేధింపులు

మేడ్చల్ పరిధిలో మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించిన యువకుడిపై పోక్సో (POCSO) చట్టం కింద కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు.

### రైల్వే అండర్ బ్రిడ్జ్ సమస్యలు

మేడ్చల్ పరిసరాల్లో రైల్వే అండర్ బ్రిడ్జ్‌ల వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
దీనికి సంబంధించిన పరిష్కారాలపై స్థానిక వార్తలు చర్చనీయాంశంగా మారాయి.

### ఆశ వర్కర్ల సమస్యలపై చర్చా కార్యక్రమం

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, ఆశ వర్కర్ల రాష్ట్ర అధ్యక్షురాలు సంతోషి పాల్గొన్నారు. ఆశ వర్కర్లపై పనిభారం తగ్గించాలని, వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని, ఫిక్స్‌డ్ సాలరీ అమలు చేయాలని, జాబ్ చార్ట్ ప్రకారమే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పాత విధానంలోనే కొనసాగించాలి

- ప్రభుత్వం తక్షణమే బకాయిలు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి
- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేసిన గుజ్జ సత్యం

కరపత్రం ప్రతినిది హైదరాబాద్, జూన్ 27



తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై వినతిపత్రం సమర్పించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని గతంలో అమలైన పాత విధానంలోనే కొనసాగిస్తూ, పెండింగ్‌లో ఉన్న నిధులను తక్షణమే విడుదల చేయించేలా రాష్ట్ర ప్రభుత్వంపై బీసీ కమిషన్ ఒత్తిడి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ, ఉన్నత విద్య పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మరియు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల హక్కు అని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వారి విద్యాభవిష్యత్తుకు జీవనాడిగా నిలుస్తోందని అన్నారు. విధాన మార్పులు, నిధుల జాప్యం కారణంగా వేలాది మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, విద్యాసంస్థలు కూడా తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇంకా విడుదల కాకపోవడంతో విద్యార్థులపై ఫీజుల భారం పెరిగిందని, అనేక కుటుంబాలు అప్పులు చేసి పిల్లల చదువులు కొనసాగించే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. విద్యను ఆర్థిక స్తోమతతో ముడిపెట్టే పరిస్థితి ఏర్పడితే సామాజిక న్యాయ స్ఫూర్తికే విఘాతం కలుగుతుందని ఆయన హెచ్చరించారు. ఇటీవల ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై తెలంగాణ హైకోర్టు కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, పెండింగ్ బకాయిలు, అమలు విధానంపై వివరణ కోరడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోందని గుజ్జ సత్యం పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ప్రజాస్వామ్య పాలనకు తగదన్నారు.

**ప్రభుత్వం వెంటనే:**

- పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా విడుదల చేయాలి.
- పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిరంతరాయంగా అమలు చేయాలి.
- విద్యార్థులపై ముందస్తు ఫీజుల భారం పడకుండా స్పష్టమైన చర్యలు తీసుకోవాలి.
- విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా సమయానుకూలంగా నిధులు విడుదల చేయాలి.

బీసీ కమిషన్ రాజ్యాంగబద్ధ సంస్థగా ప్రభుత్వం దృష్టికి ఈ సమస్య తీవ్రతను తీసుకెళ్లి విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని గుజ్జ సత్యం కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా సమన్వయంతో పనిచేయాలి

- జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాయపర్తి సర్పంచ్ రాజా జగతి ప్రకాష్ పిలుపు

కరపత్రం ప్రతినిది నడికూడ, జూన్ 27



ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాయపర్తి సర్పంచ్ రాజా జగతి ప్రకాష్ పిలుపునిచ్చారు.
జూన్ 28న నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి సంబంధించి పరకాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని శాఖల అధికారుల సన్నాహక సమావేశం శనివారం రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, విద్యాశాఖ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి మాట్లాడుతూ.. జూన్ 28న ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు. అనంతరం రెండు రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు కూడా పోలియో చుక్కలు అందజేస్తామని చెప్పారు. పోలియో చుక్కలు పిల్లలను జీవితాంతం అంగవైకల్యం బారిన పడకుండా కాపాడే సురక్షితమైన రక్షణ కవచమని పేర్కొంటూ, గ్రామ స్థాయిలో అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. సర్పంచ్ రాజా జగతి ప్రకాష్ మాట్లాడుతూ, ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా అధికారులు పరస్పర సహకారం, సమన్వయంతో విధులు నిర్వహించాలని కోరారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను సమీప పోలియో కేంద్రాలకు స్వచ్ఛందంగా తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, విద్యాశాఖ ప్రతినిధులు, పంచాయతీ రాజ్ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు - ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరి

- నేడు(ఆదివారం)నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- 0--5 సంవత్సరాల పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలి
- టీఆర్ఎస్ వరంగల్-హనుమకొండ జిల్లాల ఇన్‌చార్జి లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు పిలుపు

కరపత్రం ప్రతినిది హనుమకొండ, జూలై 27



"నిండు జీవితానికి రెండు చుక్కలు" అనే నినాదంతో జూలై 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని టీఆర్ఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల ఇన్‌చార్జి లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాన్ని పోలియో రహితంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఒక్క చిన్నారిని కూడా ఈ కార్యక్రమానికి దూరం చేయరాదన్నారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని, గ్రామాలు, పట్టణాల్లో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం ప్రతి కుటుంబానికి అత్యంత విలువైన సంపద అని పేర్కొన్న ఆయన, "రెండు చుక్కలు జీవితాంతం రక్షణ" అనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరవేయాలని అన్నారు. తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా సమీప పోలియో కేంద్రానికి వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.
ప్రతి చిన్నారి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రజలందరూ చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు కోరారు.

# బలమైన ప్రజాస్వామ్యానికి స్వచ్ఛమైన ఓటరు జాబితా పునాది

కరపత్రం ప్రతినిది బ్యూరో, జూన్ 27



బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటరు జాబితా అత్యంత కీలకమని 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం 62వ డివిజన్ పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్ఏలు) సమక్షంలో ప్రజలకు దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు వివరాల సవరణ, చిరునామా మార్పులు, పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేసుకోవాలని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు అమూల్య మైనదని, స్వచ్ఛమైన ఓటరు జాబితా నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో 62వ డివిజన్ ఇన్‌చార్జి తౌటం రవీందర్, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులు మత్తులో చిత్తు కావద్దు
## మెట్టుపల్లి జూనియర్ సివిల్ జడ్జి మాధవి

- గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి




- విద్యార్థులు మత్తులో చిత్తు కావద్దు - జూ. సివిల్ జడ్జి మాధవి.

జగిత్యాల జిల్లా మెట్టుపల్లి పట్టణంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి మాట్లాడుతూ, నేడు వివిధ రకాల మాదక ద్రవ్యాలు విద్యార్థులకు అందుబాటులోకి రావడం దురదృష్టకరమని, విద్యార్థులు మత్తులో చిత్తు కావద్దని సూచించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగ బాధితులకు చట్టపరమైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని, యువత మత్తులో చిత్తవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఎస్సై కిరణ్ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

# కోరుట్లలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణ ప్రజల భద్రత దృష్ట్యా, అత్యవసర సమయాల్లో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు కోరుట్లలో ప్రత్యేక ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కోరారు. శనివారం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు.

# బీసీ సంక్షేమ కళాశాల గృహాలు - ఎంజేపీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి

- విద్యార్థి సంఘాలు వినతి పత్రం సమర్పించారు

కరపత్రం ప్రతినిది వరంగల్ జూన్ 27
ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీ సంక్షేమ కళాశాల వసతి గృహాలు,మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని విద్యార్థి సంఘాల నాయకులు బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.బాల మాయా దేవికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు బొట్ల నరేష్,శనిగర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ,ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీ సంక్షేమ కళాశాల వసతి గృహాలు,ఎంజేపీ గురుకుల పాఠశాలలు ఇప్పటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు.అరకొర వసతులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యను కొనసాగించే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బీసీ కళాశాల హాస్టళ్లు,ఎంజేపీ గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మించి,వసతి,భోజనం,తాగునీరు,పరిశుభ్రత,భద్రత వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లా అధికారులు నరసింహమూర్తి, పుష్పలత,శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత

కరపత్రం ప్రతినిది బ్యూరో, జూన్ 27
"నిండు జీవితానికి రెండు చుక్కలు" అనే నినాదంతో నేడు (జూలై 28)న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. పోలియో వంటి ప్రమాదకర వ్యాధి నుంచి చిన్నారులను రక్షించడంలో పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత కీలకమని అన్నారు. 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఒక్క చిన్నారిని కూడా ఈ కార్యక్రమానికి దూరం చేయరాదని కోరారు.
చిన్నారుల ఆరోగ్యం ప్రతి కుటుంబానికి అమూల్యమైన సంపద అని పేర్కొన్న ఆమె, తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా సమీప పోలియో కేంద్రానికి వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.
పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని, "రెండు చుక్కలు - జీవితాంతం రక్షణ" అనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరవేయాలని ఆమె పిలుపునిచ్చారు. నేడు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేసి, ప్రతి చిన్నారి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య విజ్ఞప్తి చేశారు.

# జూలై 10న ఆర్ బివిఆర్ఆర్ మహిళా కళాశాల స్నాతకోత్సవం

కరపత్రం ప్రతినిది హైదరాబాద్, జూన్ 27
రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల 15వ స్నాతకోత్సవం జూలై 10వ తేదీన నారాయణగూడ లోని కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జె. అచ్యుతదేవి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైదరాబాద్ మహిళా విద్యా సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ ఎం.ముత్యంరెడ్డి, కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ సుదర్శన్ రెడ్డి, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి. మంజుల, వైస్ ప్రిన్సిపల్ సిందూరిలతో కలిసి ప్రిన్సిపాల్ స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించిన 302 మంది విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్స్ ను అందజేయనున్నట్లు తెలిపారు. చదువులో అత్యుత్తమంగా రాణించిన 17 మంది విద్యార్థినీలకు స్వర్ణ పతకాలను అందించనున్నట్లు తెలిపారు.

# ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో ఉద్యోగ అవకాశాలు

**జూన్ 30న సిరిసిల్లలో ఇంటర్వ్యూలు**

**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో విజన్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శనివారం సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ (ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసి,సిఇసి) ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నేషనల్ ఇంటర్ వృత్తి విద్యార్థులకు కూడా అవకాశం కల్పించినట్లు వారు తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 23 సంవత్సరాల మధ్య ఉండాలని, పురుషులు, మహిళలు ఇద్దరూ అర్హులేనని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా (సి.వి.)ను 7386968111 వాట్సాప్ నంబర్‌కు పంపాలని సూచించారు. ఈ ఉద్యోగాల ఎంపికకు సంబంధించిన ఇంటర్వ్యూలు జూన్ 30, 2026న ఉదయం 11 గంటలకు సిరిసిల్ల పట్టణంలోని ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, జెడ్‌పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా, తంగళ్లపల్లి రోడ్డులో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఉద్యోగాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 9603708122 లేదా 7386968111 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.



ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ.
నందు ఉద్యోగ అవకాశములు

ప్రపంచములో అత్యుత్తమ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలలో ఒక్కటైనా ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో శిక్షణ మరియు ఉద్యోగ అవకాశం

విజన్ టెక్నీషియన్ (VISION TECHNICIAN)

విద్య అర్హత: ఇంటర్మీడియట్ (MPC, BIPC, HEC, CEC)
*ఒకేషనల్ ఇంటర్ విద్యార్థులకు అవకాశము లేదు
వయస్సు : 18 నుంచి 23 సంవత్సరం ఉన్న వారు
Note :- MALE AND FEMALE BOTH ARE ELIGIBLE

ఇట్టి అవకాశమును సద్వినియోగించేసుకోవడానికి సిరిసిల్ల, కృష్ణ సింధూర నేత్ర వైద్య కేంద్రం నందు హాజరుకావాలని కోరుతున్నాము

గంభీరావు పేట , ముస్తాబాద్, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట్ ,కోడిమియల్ ,కోరుట్ల ,బోయినిపల్లి కోనరావు పేట ,మాదారెడ్డి ,వేములవాడ పరిసరాల ప్రాంతాల వారికి మాత్రమే.

(Interested Candidates Please Send Your Resume (C.V) To This Whatsapp No : "7386968111")

INTERVIEW ON - "30th June 2026"
PLACE : SIRCILLA , LV PRASAD EYE INSTITUTE
Z.P.H.S Girls High School Opposite , Thangallapalli Road,
SIRCILLA , AT 11:00 AM

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: , 9603708122 , 7386968111

# బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తా: ఆకుల రాజేందర్

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్, జూన్ 27:**

భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షునిగా తనను నియమించిన పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి ఆకుల రాజేందర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి కీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఓబీసీ వర్గాల అభ్యున్నతి, పార్టీ బలోపేతం మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రతి కార్యకర్తను కలుపుకుని ముందుకు సాగుతానని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న



సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.అలాగే తన సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పుప్పాల రఘు, జిల్లా కార్యదర్శులు నరసింహరాజు, నిర్మలాదేవి, హుజూరాబాద్ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, మండల అధ్యక్షులు పారుపల్లి కొండారెడ్డి, జమ్మికుంట పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, మండల అధ్యక్షులు దొంతరవిన రమేష్ యాదవ్, కమలాపూర్ మండల అధ్యక్షులు రాగం శ్రీనివాస్, ఇల్లందకుంట మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి, వీణవంక మండల అధ్యక్షులు బత్తి నరేష్ గౌడ్‌తో పాటు నాయకులు భూపతి ప్రవీణ్, ఓడ్నాల విజయ్, చిదురాల శ్రీనివాస్ రెడ్డి, రాణి, రాజశేఖర్ మరియు కార్యక్రమానికి హాజరైన పార్టీ



నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ అభివృద్ధి, ఓబీసీ వర్గాల సాధికారత కోసం నిరంతరం శ్రమిస్తూ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని ఆకుల రాజేందర్ స్పష్టం చేశారు.

# జమ్మికుంట శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో వరుణ పాశుపత మహాభిషేకం



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 27**

జమ్మికుంట పట్టణంలోని ప్రసిద్ధ లిశ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయం (బొమ్మల గుడి శివాలయం)లిలో భక్తుల సంక్షేమం, సకాలంలో వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని సంకల్పిస్తూ 2026 జూన్ 29వ తేదీ సోమవారం ఉదయం 6 గంటలకు వరుణ పాశుపత మహాభిషేకం వైభవంగా నిర్వహించబడనుంది.ఈ కార్యక్రమం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పర్యవేక్షణలో, అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో, భవాని భజన మండలి సహకారంతో నిర్వహించబడుతోంది.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్చారణల మధ్య వరుణ పాశుపత మహాభిషేకం నిర్వహించబడనుండగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మండలేముల వేణుగోపాల్ శర్మ చేతుల మీదుగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయబడతాయి. అలాగే అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.వర్షాభావ పరిస్థితులు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని ఈ మహాభిషేకం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కావున జమ్మికుంట పట్టణ ప్రజలు, పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసి, అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దివ్య ఆశీస్సులు పొందాలని కోరారు.

# చెత్త వేసే ప్రదేశాలను పచ్చదన కేంద్రాలుగా మార్చుదాం: మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 27:**

జమ్మికుంట పట్టణాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో నింపేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ తెలిపారు. పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో ఖాళీ స్థలాలు, రెండు రోడ్లు కలిసే కూడళ్ల వద్ద కొందరు చెత్తాచెదారం వేస్తున్న ప్రదేశాలను గుర్తించి, వాటిని పరిశుభ్రపరిచి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ క్రమంలో 30వ వార్డులోని పీఏసీఎస్ కార్యాలయం సమీపంలో చెత్త వేస్తున్న ప్రదేశంలో స్థానిక మహిళలతో కలిసి మున్సిపల్ చైర్మన్ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో ఇంటింటి చెత్త సేకరణ కోసం సూపర్ క్యారీ వాహనాలు, ప్రధాన రహదారులపై ట్రాక్టర్ల ద్వారా చెత్తను క్రమం తప్పకుండా సేకరిస్తున్నప్పటికీ కొందరు ప్రజలు ఇంకా



రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే చెత్తను అందించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా ఉండటంతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.పట్టణ సుందరీకరణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, చెత్త వేసే ప్రాంతాలను పచ్చదన కేంద్రాలుగా మార్చేందుకు మున్సిపాలిటీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని, నాటిన మొక్కలను సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో పల్లా నారాయణ, కటకం సంపత్, లెంకలపల్లి శరత్, స్థానిక వార్డు మహిళలు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

**అనుమతి లేని పుస్తకాల విక్రయం, అధిక ఫీజుల వసూళ్లపై పీడీఎస్‌యూ ఆందోళన**
**పోచంపల్లిలో విద్యార్థుల బ్యాగుల్లో దొరికిన నోట్‌బుక్స్‌పై విచారణ**

**కరపత్రం ప్రతినిధి మానకొండూరు జూన్ 27**

మానకొండూరు మండలం పోచంపల్లిలోని కలా సాంజ్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు విక్రయిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో విద్యార్థుల బ్యాగులను పరిశీలించగా నోట్‌బుక్స్ లభించాయి. ఈ విషయంపై మానకొండూరు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) శ్రీనివాస్ పాఠశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. సంబంధిత వివరాలను సేకరించి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో)కి నివేదిక పంపిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి అంగిడి కుమార్ మాట్లాడుతూ, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని



ఆరోపించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అధిక ఫీజుల భారం మోపుతూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించే పరిస్థితి ఏర్పడిందని, దీనివల్ల అనేక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఎన్‌సీఈఆర్ పుస్తకాలను విద్యార్థులకు విక్రయించడం ద్వారా విద్యా హక్కులను కాలరాస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా విద్యాశాఖ అధికారులు కఠిన పర్యవేక్షణ నిర్వహించాలని కోరారు.



విద్యను వ్యాపారంగా మార్చి అధిక లాభాలు ఆర్జిస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై వెంటనే విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన సంస్థల గుర్తింపులను రద్దు చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించింది.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకిని మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వెల్దిరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

# జోగిపేటలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం




**కరపత్రం ప్రతినిధి అందోలు (జూన్ 27)**

సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలోని అన్ని పోలింగ్ బూతుల వారీగా ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం జరుగుతుంది. శనివారం 206,207 పోలింగ్ బూత్ ఏరియాలో బిఎల్ఓలతో కలసి పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ బి.ఎల్.ఎలు చాపల వెంకటేశం, మహ్మద్ రఫీక్ మరియు ఖలీల్ పాల్గొన్నారు. బిఎల్ఓల ద్వారా ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి సమర్థవంతంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా అవసరమైన వివరాలను సేకరించాలని తెలిపారు.ప్రజలు బీఎల్ఓల ద్వారా అందించే ఎన్యుమరేషన్ ఫారమ్ ను సక్రమంగా నింపి సమర్పించాలని, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.


# విద్యుత్ భద్రతపై విద్యార్థినులకు అవగాహన

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్ (రామగుండం), జూన్ 27:**

జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు 2026 (26 జూన్--2 జులై)లో భాగంగా.. ఎన్‌టిపిసి రామగుండం, తెలంగాణ ప్రాజెక్టుల అధికారులు కేంద్రీయ విద్యాలయం, శ్రీచైతన్య స్కూల్, సెయింట్ క్లేర్ స్కూల్, ఇతర విద్యా సంస్థలతో సహా పలు టౌన్‌షిప్ పాఠశాలల్లో విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ భద్రత ప్రాముఖ్యత గురించి పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మన దైనందిన జీవితంలో సురక్షితమైన పద్ధతులను పాటించేలా ప్రోత్సహించడం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఇంటరాక్టివ్ సెషన్‌లు, ప్రదర్శనలు, అవగాహన ప్రసంగాల ద్వారా, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకుండా ఉండటం.. పాడైన విద్యుత్ తీగలకు దూరంగా ఉండటం, విద్యుత్ పరికరాల దగ్గర ఆడకూడదన్నారు. అసురక్షిత విద్యుత్



పరిస్థితులను వెంటనే పెద్దలకు తెలియజేయడం వంటి ముఖ్యమైన భద్రతా చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశాల సందర్భంగా, విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగు వారికి విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా "భద్రతా రాయబారులు"గా వ్యవహరించాలని ప్రోత్సహించారు. వారు సురక్షితమైన ప్రవర్తనను పాటించాలని, అలాగే విద్యుత్ భద్రతా నిబంధనలను అనుసరించేలా ఇతరులను ప్రేరేపించాలని వారికి సూచించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, వక్తలు "విద్యుత్ భద్రత అనేది యాదృచ్ఛికం కాదని, అది మన ఎంపిక" అని చెప్పారు. విద్యుత్



ప్రమాదాలను నివారించడంలో వ్యక్తిగత బాధ్యత యొక్క ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావించారు. తాము వెళ్ళే ప్రతిచోటా విద్యుత్ భద్రతా నియమాలను పాటిస్తామని, భద్రతా సంస్కృతిని ప్రోత్సహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ అవగాహన కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి స్పందన లభించింది. విద్య, అవగాహన, ప్రజా భాగస్వామ్యం ద్వారా భద్రతా చైతన్యాన్ని పెంపొందించడానికి, సురక్షితమైన సమాజాన్ని నిర్మించడానికి ఎన్‌టిపిసి రామగుండం, తెలంగాణ ప్రాజెక్టులు కట్టుబడి ఉన్నాయని చెప్పారు.